
సాక్షి ఒడిశా

శుక్రవారం । 26 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,17,223లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



'కృష్ణచంద్ర' సేవలు అనిర్వచనీయం

- 8లో▸



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- 8లో▸

న్యూస్‌రీల్

రాణిపేటలో తాగునీటికి ఇక్కట్లు



ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి సమీపంలోని మేజర్ పంచాయతీ రాణిపేటలో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. గత వారం రోజులుగా వడగాలులకు తోడు నీటి కష్టాలు ఎదురవ్వడంతో స్థానికులు అల్లాడుతున్నారు. సమితి మాజీ సభ్యులు పిన్నింటి కిరణ్‌కుమార్ తన సొంత నిధులతో నీళ్ల ట్యాంకర్‌తో రోజూ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అధికారులు స్పందించి, పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మావోయిస్టుల నియంత్రణకు చర్యలు

- దక్షిణాంచల్ డీఐజీ చరణ్‌సింగ్ మినా



డీఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న చరణ్‌సింగ్ మినా

కొరాపుట్: మావోయిస్టుల ప్రభావాన్ని నియంత్రించడంలో కఠిన చర్యలు తప్పవని దక్షిణాంచల్ రేంజ్ డీఐజీ చరణ్‌సింగ్ మినా ప్రకటించారు. స్థానిక రేంజ్ ఇటీవల బదిలీ అయిన ఆయన.. కొరాపుట్ లోని తన కార్యాలయం గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు 5టీ లక్ష్యాల సాధనలో తనవంతు కృషి చేస్తామన్నారు. మావోయిస్టులపై రాజీలేని వైఖరి పాటిస్తామని తెలిపారు. తనకు కొరాపుట్ ప్రాంతంపై గతంలో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. బలహీన వర్గాలు, మహిళలకు ఎల్లవేళలా పోలీసుల సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మొపుతామన్నారు. సామాన్య ప్రజలకు పోలీసు వ్యవస్థ అనుబంధంగా ఉండేలా చర్యలు చేపడతామని వివరించారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల అల్టిమేటం



జెడ్పీ చైర్మన్ తిరుపతిరావుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పర్లాకిమిడి: దీర్ఘకాలికంగా పోరాటం చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్ గ్రేడ్‌పే రూ.1,900 నుంచి రూ.4,200లకు పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా తాత్సారం వహిస్తోందని గజపతి మిళిత మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గత కొద్ది రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావును ఆయన ఛాంబర్‌లో గురువారం కలిసిన ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. డిమాండ్ పరిష్కారానికి ఈనెల 31లోగా ప్రభుత్వం స్పందించని పక్షంలో అంతా సామూహిక సెలవులకు దిగుతామని సంఘం కార్యదర్శి సంధ్యారాణి శాబోరా స్పష్టంచేశారు. దీనికి సంబంధించి అల్టిమేటం కాపీని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపారు.

పర్లాకిమిడిలో శీతల షష్టి



శివపార్వతుల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని పొడుగు కోవెల, రామ లింగేశ్వర ఆలయం, తెలుగు సోండి వీధి బాలుంకేశ్వర్ ఆలయంలో బుధవారం రాత్రి శీతలషష్టి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం అనంతరం గురువారం సాయంత్రం పర్లాకిమిడి మెయిన్ రోడ్డులో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

కన్నీరుమున్నీరు..

రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో ఐదుగురు మృతిచెందారు. ఇందులో ఒకటి ఆదర్శంగా నిలవగా, మరొకటి ఆక్షేపనీయంగా మారింది. అలాగే మామిడికాయల కోసం వెళ్లిన బాలుడు పిడుగుపాటుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. నవరంగ్‌పూర్ జిల్లాలో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన యువకుడు నదిలో మునిగి మృతిచెందాడు. మల్కన్‌గిరిలో వేటకు వెళ్లిన మత్స్యకారులు పడవ బోల్తా పడి ప్రాణాలు కోల్పోయాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

- వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి
- రాయగడలో 24 గంటల వ్యవధిలో మృతిచెందిన భార్యభర్తలు
- కాశీనగర్‌లో భార్యను నరికి, తలతో ఊరేగిన భర్త
- విషాదంలో బాధిత కుటుంబాలు

బడాసరాలో దారుణం..



బడసరాలో దర్యాప్తు చేస్తున్న ఎస్‌డీపీఓ రామకృష్ణపతి

పర్లాకిమిడి: వేట కోడవలితో భర్తే.. భార్యను నరికిన ఘటన కాశీనగర్ సమితి బడసరా గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణపతి తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర కార్జి(36), భార్య ఊర్మిలా కార్జితో కలిసి గురువారం ఉదయం తమ కాయగూరల క్షేత్రానికి వెళ్లారు. అక్కడ ఏదో విషయమై ఇద్దరి మధ్య తగాదా జరగడంతో ఆగ్రహానికి గురైన ఆయన.. కొడవలితో భార్య మెడ నరికాడు. మొండేన్ని అక్కడే వదిలి, తలను పట్టుకొని ఇంటికి నడిచి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల వారు కాశీనగర్ పోలీసుసులకు సమాచారం అందించారు. మేరకు ఐఐసీ సుశాంతకుమార్ సాహు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు.



పోలీసుల అదుపులో చంద్రశేఖర కార్జి



నర్సింహం, లలిత(ఫైల్ ఫొటో)

రాయగడ: భర్త మృతిచెందడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భార్య.. 24 గంటల్లోనే మృతిచెందింది. స్థానిక హెడ్ పోస్టాఫీస్ సమీపంలోని సంతోషిమాత మందిరంలో ప్రధాన అర్చకులుగా ఉన్న శ్రీపాద అప్పలనర్సింహం(69) మంగళవారం మృతిచెందారు. స్థానిక బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆయనకు బుధవారం అంత్యక్రియలు చేశారు. అయితే తీవ్ర మనోవేదనకు గురైన అతని భార్య లలిత(59).. బుధవారం రాత్రి 9.30 గంటలకు తుదిస్వాస విడిచారు. దీంతో ఆదర్శ దంపతులంటూ ఇరువురినీ స్థానికులు స్మరించుకున్నారు. అప్పలనర్సింహం, లలితల ఇద్దరి కుమారులు కూడా ఇదే మందిరం ప్రాంగణంలోని షిర్డీసాయి, గణపతి మందిరాల్లో అర్చకత్వం చేస్తున్నారు.

పిడుగుపాటుకు బాలుడు..



బుదు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

రాయగడ: పిడుగుపాటుకు బాలుడు మృత చెందిన ఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి బొడొమటో కోబడి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడు అదే గ్రామానికి చెందిన బుదు కొంధొపాణి(9)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం పెనుగాలులు వీయడంతో పక్కనే ఉన్న మామిడి చెట్టు వద్ద రాలిన పండ్లు ఏరుకునేందుకు బుదు వెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు వెళ్లి చూసేసరికి విగతుడై పడి ఉండటంతో అంతా బోరుమన్నారు.

పడవ బోల్తా పడి..



మల్కన్‌గిరి: కృప బెనియా మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకు వస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: జలాశయంలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి బలిమెల జలాశయంలో నాటు పడవ బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. నక్కమమ్ముడి పంచాయతీ డైక్-3 గ్రామానికి ఎందిన కృప బెనీయా(46), హరి సగరియ, కై లాశ్ నాయక్ బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లారు. కొంత దూరం వెళ్లి, చేపల కోసం వల వేయగా.. భారీ గాలి రావడంతో పడవ బోల్తా పడింది. దీంతో కృప బెనియా గల్లంతు కాగా, మిగతా ఇద్దరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. ఘటన తెల్లవారుజాము 4గంటలకు జరగ్గా వెంటనే బలిమెల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఉదయం 6గంటల నుంచి జలాశాయంలో గాలించగా.. 9గంటలకు మృతదేహం లభించింది. బలిమెల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంధ్రావతిలో ఇంటర్ విద్యార్థి..

కొరాపుట్: ఇంద్రావతి నదిలో మునిగి ఇంటర్మీడియెట్ విద్యార్థి మృతిచెందిన విషాద ఘటన నవరంగ్‌పూర్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇచ్ఛావతిగుడలో నివాసం ఉంటున్న ఎస్.చలం కుమారుడు ఎస్.మురళీకృష్ణ(18) మృతిచెందాడు. మధ్యాహ్నం తన మిత్రులతో కలిసి ఇంద్రావతి నది చెక్‌డ్యాం వద్దకు స్నానానికి వెళ్లిన యువకుడు.. ఈత రాక పోవడంతో మునిగిపోయాడు. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది అక్కడికి చేరుకొని మృదేహాన్ని వెలికి తీశారు. దీనిపై కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



మురళీకృష్ణ(ఫైల్)



కొరాపుట్: మృతదేహాన్ని తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిరుత చర్మాలు స్వాధీనం

- నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్‌టీఎఫ్ పోలీసులు

రాయగడ: పోలీస్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సిరగుడ కూడలిలో ఓ వ్యక్తి నుంచి 3 చిరుతపులి చర్మాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కాసీపూర్ సమితి పరిధి టికిరి పంచాయతీ నకిటిగుడ గ్రామానికి చెందిన నిందితుడు డొంబురుధర మాఝిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారంతో నిర్వహించిన ఈ దాడిలో సిరిగడ కూడలిలో కొంతమంది వ్యక్తులు పులి చర్మాలను తీసుకువచ్చి మాఫియాతో బేరసారాలు ఆడుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు చాకచక్యంగా పన్నాంగ పన్ని, నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న చిరుత చర్మాలను పరీక్షించేందుకు డెహ్రాడూన్‌కు పంపించినట్లు పోలీసులు వెల్లడించారు.



నిందితుడు డొంబురు మాఝి



స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మాలు

ఘుముసురా అడవిలో గజరాజు మృతి



మృతిచెందిన ఏనుగు వద్ద అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు

బరంపురం: గంజాం జిల్లా ఉత్తర ఘుముసురా అటవీరేంజ్ తారాసింగ్ అడవిలో ఏనుగు మృతిచెందిన ఘటనపై గ్రామస్తులు అటవీశాఖ అధికార్లకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న డివిజన్ అధికారులు.. గజరాజు కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ఘుముసురా అడవి నుంచి తారాసింగ్ గ్రామ శివారులో పండిస్తున్న కూరగాయల పొలాల్లోకి ఏనుగుల గుంపు ప్రవేశించినట్లు తెలిపారు. వీటిలో ఒకదానిపై ఒకటి పరస్పరం దాడులకు దిగడంతో మగ ఏనుగు మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం గజరాజు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

నియమగిరి గ్రామాల్లో ఐఫాడ్ బృందం

- డొంగిరియాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఏటా నిధుల మంజూరు
- క్షేత్రస్థాయిలో అమలును పరిశీలించిన ఇటలీ, రోమ్ దేశాల ప్రతినిధులు



కాంభేసు గ్రామంలో పర్యటిస్తున్న విదేశీ ప్రతినిధుల బృందం

రాయగడ: ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్(ఐఫాడ్) సంస్థకు చెందిన ఇటలీ, రోమ్ దేశాల ప్రతినిధుల బృందం జిల్లాలోని డొంగిరియా ప్రాంతాల్లో గత 2 రోజులుగా పర్యటించింది. ఆ సంస్థకు చెందిన పామేలా వీటంక్ నేతృత్వంలో సునీత రంగస్వామి, హెనాడెస్ బొరా, కె.బాలసుబ్రమణ్యం తదితరులు నియమగిరి పర్వత ప్రాంతాల్లోని బిసంకటక్ సమితి చాటికొన పంచాయతీ పరిధి సన్యాసిగుడ, సంగడ, ఖాంబేసు, ఖజురి తదితర గ్రామాలను సందర్శించారు. డొంగిరియా ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధిలో భాగంగా ఐఫాడ్ సంస్థ డొంగిరియా కొండొ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(డీకేడీఏ), ఒడిశా ఎంపవర్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్స్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(ఒపిలిపి) సంస్థలకు ఐఫాడ్ ఏటా నిధులు మంజూరు చేస్తోంది. క్షేత్రస్థాయిలో వీటి సద్వినియోగం, అమలును ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో సమావేశమై, వారి జీవిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో పురోగతిని ఆరా తీశారు. వ్యవసాయీకరణలో మెలకువలు, నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలను సేకరించారు. గత ఆరేళ్లుగా ఈ ప్రాంతంలోని ఒపిలిపి, డీకేడీఏ సంస్థల పనితీరుపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. డొంగిరియాల వ్యసాయ క్షేత్రాల్లో వెళ్లిన ప్రతినిధులు.. యాంత్రీకరణలో అవగాహన తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మరింత సహకారం అవసరం..

ఇదిలా ఉండగా నియమగిరి పర్వత ప్రాంతాల్లోని డొంగిరియా తెగ ప్రజలు వ్యవసాయ రంగంలో భాగంగా పైనాపిల్, పసుపు తదితర పంటలపై అధిక శ్రద్ధ వహిస్తున్నప్పటికీ ఆయా రంగాల్లో వారు పురోగతి సాధించడం లేదు. దీనికి గల కారణాలను ప్రతినిధి బృందం సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతాల్లో పసుపు, పైనాపిల్ పంటలకు అనువైన వాతావరణం ఉండటంతో అధిక దిగుబడులు వస్తున్నా.. రైతులకు తగిన సౌకర్యాలు లేకపోవడంతో ఆర్థికంగా ముందుడుగు వేయలేకపోతున్నారని డీకేడీఏ పీఓ సుదర్శన్ పాఢి తెలిపారు. ఏటా పైనాపిల్ పంట గణనీయంగా ఉన్నప్పటికీ తగిన శీతల గిడ్డంగులు లేకపోవడం, గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందని వివరించారు. ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే.. డొంగిరియాల్లో మరింత అభివృద్ధి సాధ్యమతుందని ఆకాంక్షించారు.

సాదర స్వాగతం..

జిల్లాలోని డొంగిరియా ప్రాంతాల్లో రెండు రోజులు పర్యటించిన ఐఫాడ్ బృందం స్థానిక మహిళలతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కోళ్లు, మేకల పెంపకం, కుట్టుమిషన్, పుట్టగొడుగుల ఉత్పత్తి తదితర రంగాలపై ఆసక్తి కనబరాలని సూచించారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి జరిగితే దేశం అన్ని విధాలా పురోగతి సాధిస్తుందని ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తంచేశారు. అలాగే గ్రామాల్లో పర్యటించిన ప్రతినిధుల బృందానికి డొంగిరియా మహిళలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. సంప్రదాయ రీతిలో ఘనస్వాగతం పలికారు. వారి ఆదరాభిమానాలకు ముగ్ధులైన ఇటలీ, రోమ్ ప్రతినిధులు.. స్థానిక మహిళలతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.



విదేశీ అతిథులకు స్వాగతం పలుకుతున్న డొంగిరియా మహిళ



డొంగిరియా మహిళలతో సమావేశమైన ప్రతినిధుల బృందం



కోళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

3న జాబ్ ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వాయిదా పడిన పోస్టులకు జూన్ 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బీసీడీఈ కో-ఆర్డినేటర్ పోస్టులకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు బీఆర్ఏయూ.ఈడీయూ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రక్తదాతలకు ప్రశంసలు



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఈవో

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా రక్తనిధి కేంద్రంలో రక్తం కొరత ఉందని, ఈ నేపథ్యంలో త్వరలో విద్యాశాఖ ద్వారా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. స్థానిక రక్తనిధి కేంద్రంలో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 12 మంది రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, బి.చిన్నయరావు, పి.చైతన్యకుమార్, ఎ.నరసింగరావు, ఎ.బేగం, చేయి చేయి కలుపు సంస్థ ప్రతినిధులు వినోద్‌కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షునిగా పలిశెట్టి



పలిశెట్టి దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పలిశెట్టి దామోదరరావు (శ్రీకాకుళం) నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జరిగాయి. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఓబులేసు, ముఖ్య సలహాదారుగా కటకం పద్మాకర్, ఉపాధ్యక్షులుగా పి.సత్యన్నారాయణ (విజయనగరం), రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పి.భానుమూర్తి (విజయనగరం), రాష్ట్ర కార్యదర్శులుగా చింతాడ వెంకటరావు (శ్రీకాకుళం), ఎస్.రామారావు (విశాఖపట్టణం), పి.నానాజీ (శ్రీకాకుళం)లు ఏకగ్రీవంగా విజయనగరం జోన్ నుంచి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గం రాష్ట్ర నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ రిటైర్డ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ శర్మ, జిల్లా కార్యదర్శి కొర్లాం గణేశ్వరరావు, అధ్యక్షులు ఆర్‌పి రావు, జిల్లా కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన సవర చిరంజీవి

మెళియాపుట్టి: స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సవర జాడుపల్లికి చెందిన సవర చిరంజీవి, సవర ఢిల్లేశ్వరరావులు వ్యక్తిగత పనిపై జాడుపల్లి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెస్తుండగా మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో చిరంజీవి తలకు బలమైన గాయంకాగా, వెనుకనున్న ఢిల్లేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యుద్ధ ప్రాతిపదికన స్తంభాల పునరుద్ధరణ



తురకపేట వద్ద విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం వీచిన ఈదురు గాలుల కారణంగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. గురువారం ఉదయానికే మండలానికి చేరుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది కార్మికులతో కలిసి స్తంభాలు ఏర్పాటు, వైర్లు సరిచేసే పనులు చేపట్టినట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. తురకపేటలో సుమారు పది స్తంభాలు నేలకొరిగాయని చెప్పారు. బాలేరు, కొత్తపేట, తురకపేట, కృష్ణాపురం, కవిటి, చొర్లంగి, దబ్బపాడు, సిద్ధాంతం తదితర గ్రామాల్లో స్తంభాలను పునరుద్ధరించామని తెలిపారు.



గజపతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అధికారులు, సంఘాల ప్రతినిధులు



బరంపురం: గజపతి మహరాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బరంపురం: విజయ టాకీస్ జంక్షన్‌లో పాల్గొన్న ఒడియా సంఘాల ప్రతినిధులు

‘కృష్ణచంద్ర’ సేవలు అనిర్వచనీయం

- ఉత్కళ రాష్ట్ర నిర్మాత కృష్ణచంద్ర గజపతికి నివాళులు

పర్లాకిమిడి: ఉత్కళ రాష్ట్ర నిర్మాతగా పర్లాఖెముండి మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్ అందించిన సేవలు అనిర్వచనీయమని వక్తలు కొనియాడారు. కృష్ణచంద్ర గజపతి వర్థంతి కార్యక్రమాన్ని జిల్లా సంస్కృతి పరిషత్, ఉత్కళ హితేషిణీ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్ పాత బస్టాండ్‌లోని కృష్ణచంద్ర గజపతి విగ్రహానికి పూలమాలలు వేశారు. మహారాజా సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఒడియా మంగళి వీధిలోని ఉత్కళ సమాజ్ భవనంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఏడీఎం దాస్ మాట్లాడుతూ స్వతంత్ర ఉత్కళ రాష్ట్రా అవతరణకు ఆయన సేవలు మరువరానివన్నారు. అలాగే ఉత్కళ హితేషిణీ అధ్యక్షుడు పూర్ణచంద్ర మహాపాత్రో, రాష్ట్ర సాహిత్య అకాడమీ సభ్యులు విచిత్రానంద బెబర్తా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బినోద్‌జెన్నా, భరత్ భూషణ్ మహంతి తదితరులు మాట్లాడారు. ఇందులో భాగంగా ఒడియా భాషా పండితులు, హింజిలికాట్ సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మేజర్ రాజారమణ పాఢిని సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఒడియా ఉన్నత పాఠశాలలో 594 మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థి, సాధారణ సైకిల్ మెకానిక్ కుమారుడు మిట్టు మహాపాత్రోను సన్మానించి, ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ అర్చనా మంగరాజ్, భీంసేన్ మండల్(పాతపట్నం), భాగవత్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

జన ప్రియతమ నేత..

బరంపురం: ఒడియా ప్రజల ప్రియతమ నాయకుడు, పర్లాకిమిడి మహరాజ్ కృష్ణచంద్ర గజపతి అని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రశంసించారు. ఆయన వర్థంతిని ఒడియా సంఘాలునిర్వహించాయి. బహుముఖి సమాజ్ మంగళ సంస్కృతి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాల ప్రాంగణం, విజయా టాకీస్ జంక్షన్‌లో విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రత్యేక ఒడిశా రాష్ట్ర ఏర్పాటుకు కృష్ణచంద్ర గజపతి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఒడిశా తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని వివరించారు. అలాగే ఎంకేసీజీ ప్రాంగణంలో మానవాధికారి సురక్షమంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిధులు త్రినాథ్ మహరణ, కృష్ణచంద్ర దాస్, డాక్టర్ సంతోషన్ పాత్రో, సుభాష్ పట్నాయక్, మహ్మద్ ఆలమ్, మాజీ కార్పొరేటర్ భీష్మాచార్య చౌధురి, అవనీకుమార్ గయా తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి అభివృద్ధిలో..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని నవెక్స్ బోర్డు పాఠశాలలో కృష్ణచంద్ర గజపతి విగ్రహానికి జిల్లా అదనపు కలెక్టర్ మాహేశ్వర్‌చంద్ర నాయక్ పూలమాల వేసి, నివాళులర్పించారు. కొరాపుట్ అవిభక్త జిల్లాగా ఉన్న రోజుల్లో మల్కన్‌గిరి అభివృద్ధికి కోసం ఆయన ఎంతో చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాహిత్య సమ్మేళనం..

పర్లాకిమిడి: మహారాజా కృష్ణచంద్ర గజపతి వర్థంతి నేపథ్యంలో సాహిత్య దక్షిణ ఒడిశా సాహిత్య సమ్మేళనాన్ని స్థానిక శ్రీశైలం కల్యాణ మండపంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దేశ్వర మిశ్రా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ విమర్శకులు రంగనాయక్, సరస్వతీ శిశు విద్యామందిర్ ప్రధాన ఆచార్యులు సరోజ్‌కుమార్ పండా, దక్షిణ ఒడిశా సాహిత్య సమ్మేళనం రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు గౌరంగ్ రౌతో పాల్గొని మాట్లాడారు. పర్లాఖెముండి మహారాజా కృష్ణచంద్ర గజపతి 1905లో ఉత్కళ హితేషిణీ స్థాపించడంతో పాటు స్వతంత్ర రాష్ట్రంలో ఒడియా కవులకు జీవం పోశారన్నారు. అనేక మంది కవులు, న్యాయవాది పండిత మధుసూదన్ దాస్, హరేకృష్ణ మహతాబ్, గాయకులు గోపాలకృష్ణ పట్నాయక్ తదితరుల త్యాగఫలమే నేటి స్వతంత్ర ఒడిశా అని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తనూజా శత్పతి, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఎం బీరేంద్రకుమార్ దాస్



పదో తరగతి విద్యార్థిని సన్మానిస్తున్న ఉత్కళ హితేషిణీ సమాజ్



మల్కన్‌గిరి: ఎక్స్ బోర్డు పాఠశాల వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు



పర్లాకిమిడి: సాహితీ సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు, కవులు

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



ప్రమాద స్థలంలో పట్టాలు సరిచేస్తున్న రైల్వే సిబ్బంది

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- చిలికా-కల్లికోట్ మధ్య ఘటన

బరంపురం: గంజాం జిల్లా చిలికా-కల్లికోట్ మధ్య గంగపూర్ నుంచి ఖుర్దా వైపు వెళ్లే గూడ్స్ రైలు గురువారం మధ్యాహ్నం పట్టాలు తప్పింది. ప్రమాదాన్ని పసిగట్టిన లోకో పైలెట్ ఒక్కసారిగా రైలును ఆపడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రైల్వేశాఖ ఎటువంటి అస్తినష్టం జరగలేదు. సమాచారం అందుకున్న ఖుర్దా రైల్వే డివిజన్, పలాస డివిజన్ రైల్వే అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, పట్టాలు తప్పిన వ్యాగన్లను సరి చేశారు. దీనిపై ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని గంగపూర్ నుంచి వైట్ సిమ్మెంట్ లోడుతో ఖుర్దా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు గురువారం ఉదయం పట్టాలు తప్పింది. చిలికా-కల్లికోట్ మధ్య ఈ ప్రమాదం చోటు చేసుకోగా, సకాలంలో లోకోపైలట్ స్పందించడంతో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు. అయితే వ్యాగ్లను సరిచేసే సరికి సాయంత్రం కావడంతో రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపింది. పలు రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



బరంపురం రైల్వేస్టేషన్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

కొలాబ్ సీఈ కార్యాలయానికి తాళం



సీఈ కార్యాయం ముందు నినాదాలు చేస్తున్న దృశ్యం

- కెనాల్ రోడ్డు, వంతెనలు మరమ్మతు చేయాలని డిమాండ్

జయపురం: అప్పర కొలాబ్ సాగునీటి ప్రాజెక్టు కెనాల్ రోడ్డు, వంతెన పునరుద్ధరించాలని వివిధ పంచాయతీలకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పందించక పోవడంతో అప్పర్ కొలాబ్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయానికి గురువారం తాళాలు వేశారు. సామాజిక కార్యకర్త బి.హరిరావు నేతృత్వంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ముందుగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీఈ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పర కెనాల్‌కు ఇరువైపులా 10 గ్రామ పంచాయతీలకు చెందిన అనేక గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఇదే రోడ్డుపై ఆధారపడి అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. అయితే కెనాల్ మార్గంలోని కొలాగుడ గ్రామం నుంచి కొంగ గ్రామం వరకు రోడ్డు, వంతెనలు దెబ్బతిన్నాయని వాపోయారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు అందించినా, పట్టించుకోలేదని ఆరోపించారు. అప్పర్ కొలాబ్ మెయిన్ కెనాల్ కొట్‌పాడ్ వరకు ప్రాజెక్టు అధికారులు రోడ్డు, వంతెనలు ఏర్పాటు చేసినా వాటి రక్షణ, మరమ్మతులకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. ఎప్పటికీ స్పందించక పోవడంతో చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి కార్యాలయానికి తాళాలు వేయాల్సి వచ్చిందని వివరించారు. దీనిపై స్పందించిన సీఈ.. ఇతర ప్రాజెక్టు అధికారులతో కలిసి ఆందోళనకారులతో చర్చించారు. త్వరలోనే కెనాల్ రోడ్డు, వంతెనలు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన ప్రజలు.. కార్యాలయం తాళాలు తెరిచారు.



చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి తాళాలు వేస్తున్న గ్రామస్తులు

డంపింగ్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి సమీపంలో గురువారం చెత్తను డంప్ చేసే మున్సిపాలిటీ వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎస్ దొర తెలిపారు. రిమ్స్ పరిసర ప్రాంతాల్లో 45 నుంచి 50 ఏళ్లు నిండిన వ్యక్తి కొంతకాలంగా యాచక వృత్తి కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఏపీ30టీఏ3582 నంబరు గల డంపింగ్ వ్యాను ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు తెలిసిన వారు శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస స్టేషన్‌కు 089222306, 9440470450 నంబర్లకు తెలియజేయాలన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

వరకట్న వేధింపుల కేసులో వ్యక్తి అరెస్టు

పోలాకి: మండలంలోని పిరువాడకు చెందిన ఎన్ని రమేష్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు. నిందితుడి భార్య ఢిల్లీశ్వరి నాలుగురోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రమేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడికి రిమాండ్ విధించటంతో జిల్లా జైలుకు తరలించారు.

ఇంటర్ ఉత్తీర్ణులకు కెరీర్ ప్రోగ్రాం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), హెచ్‌సీఎల్- టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో 'హెచ్‌సీఎల్ టెక్‌బీ' పేరిట కెరీర్ ప్రోగ్రాం అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి పీబీ సాయిశ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 27న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని మునసబ్‌పేటలో ఉన్న గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీలో జరిగే క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. వివరాలకు వెంకటరమణ (సెల్:6301045132), వేణుగోపాల్ (సెల్:8317652552) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సంఘటితంగా ఉంటేనే సమాజాభివృద్ధి

ఇచ్ఛాపురం: సమాజంలో ప్రతిఒక్కరూ సంఘటితంగా ఉంటేనే సమాజం బాగుపడుతుందని కృష్ణా జిల్లా గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి అన్నారు. ధర్మ ప్రచార పర్యటనలో భాగంగా గురువారం పురుషోత్తపురం పుష్పగిరిపై షిర్డిసాయిబాబా ఆలయం, బెల్లుపడ త్రినాథస్వామి ఆలయంలో మారుతి జ్యోతిర్విద్య గ్రంథాలయం అధ్యక్షులు తెన్నేటి తేజేశ్వరశర్మ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ మాతృభూమి, మాతృభాషను పరిరక్షించుకోవడం అందరి కర్తవ్యమన్నారు.

సకాలంలో చార్జిషీటు దాఖలు చేయాలి



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్ : నేరానికి సంబంధించి చార్జిషీటును కోర్టులో సకాలంలో దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధికను శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీని కలిసినవారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావుతో, అసోసియేషన్ కార్యదర్శి పి.రాము, ఉపాధ్యక్షుడు జి.చంద్రమోహన్, లైబ్రరీ సెక్రటరీ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స



కుటుంబ సభ్యులకు కిట్ అందజేస్తున్న వైద్యబృందం

శ్రీకాకుళం రూరల్: జిల్లావాసులకు అత్యున్నత వైద్య సేవలు అందిస్తున్న రాగోలు జెమ్స్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స కాక్లియర్ ఇంప్లాంట్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం జెమ్స్‌లో నిర్వహించిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే మూగ, చెవుడు చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స అందిస్తారని చెప్పారు. దీనిలో భాగంగానే విశాఖ జిల్లాకు చెందిన వెంకన్నపాలెంకు చెందిన సురేష్, సంతోషి దంపతుల రెండేళ్ల కుమారుడు షణ్ముఖ్, కోష్ఠకు చెందిన సతీష్, రోహిణి దంపతుల కుమార్తె మూడేళ్ల దీక్షితలకు జెమ్స్ వైద్య బృందం డాక్టర్ తాతారావు, జనార్దన్, కృష్ణకిషోర్‌లు శస్త్రచికిత్స విజయవంతం చేసినట్లు వివరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కూడా చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుధీర్, శ్రీనివాసులు, మెడికల్ సూపరింటెండెంట్ బాలమురళి, ప్రవీణ్ పాల్గున్నారు.

పాతపట్నంలో ఆధ్యాత్మిక శోభ



ఆకట్టుకున్న రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం శాస్త్రీయ నృత్యప్రదర్శన



నందిపై శివుడు

పాతపట్నం నీలమణిదుర్గ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మొత్తం 70 వీధుల్లో పురాణ ఇతిహాసాల్లోని కీలక ఘట్టాలను విగ్రహాల రూపంలో ఏర్పాటు చేశారు. వీటిని చూసేందుకు భారీగా భక్తులు తరలివస్తున్నారు.

–పాతపట్నం



ఆది శేషుడుపై బాలకృష్ణుడు



వరాహ నరసింహావతరం..

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

కొత్తవలస: ప్రేమ పేరుతో వేధించడంతో మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేధింపులకు పాల్పడిన అదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి గాటీలు (19)పై ఎస్సై బొడ్డు దేవి కేసు నమోదు చేసి అరెస్టు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

గొట్లాంలో నగలు, నగదు చోరీ



దొంగతనం జరిగిన ఇంటి ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గురువారం వేకువ జామున దొంగలు హడావుడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లోళ్ల నర్సింహమూర్తి ఇంట్లో వేకువ జామున గుర్తు తెలియని వ్యక్తి చొరబడి ఆయన భార్య మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడుతో పాటు ఇంట్లోని బీరువాలో గల రూ.2500 నగదు అపహరించుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇంటి పరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల వారిని విచారణ చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. అలాగే గ్రామంలో గల షాలోమే ఆస్పత్రి యజమాని ఇంట్లో కూడా దొంగతనానికి ప్రయత్నించగా ఇంట్లో వారు అప్రమత్తం కావడంతో దొంగ ఉడాయించారు. గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడుతో పాటు సీసీఎస్ సర్కిల్ సీఐ, క్లూస్ టీమ్ సిబ్బంది ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో అక్రమంగా గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఐదుకిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోకపేటకు చెందిన బొంతు వెంకటేశ్వరరావు గంజాయి తరలిస్తున్నట్లు తెలిసిన సమాచారం మేరకు ఆర్అండ్‌బీ జంక్షన్ దగ్గర తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సైలు భాస్కరరావు, రామగణేష్, సిబ్బంది గంజాయి తరలిస్తున్న వెంకటేశ్వరరావును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా భానుమూర్తి



రాష్ట్ర మహాసభల్లో భానుమూర్తిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా పెంట భానుమూర్తి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని నిడమానూరు మురళి రిసార్ట్స్'లో బుధవారం నిర్వహించిన యూనియన్ రాష్ట్ర మహాసభల్లో తనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తెలిపారు. 30 ఏళ్లు డిపో కార్యదర్శిగా, జోనల్ కార్యదర్శిగా పనిచేశానని, రాబోయే రోజుల్లో మరింతగా సేవలందించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

జైళ్లశాఖలో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలి

విజయనగరం క్రైమ్: జైళ్ల శాఖలో పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న అధికారులు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని సబ్ జైల్ జిల్లా అధికారి మధుబాబు, జైలర్ శివప్రసాద్‌లు ఆకాంక్షించారు. విజయనగరం సబ్‌జైలర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై విశాఖ సెంట్రల్ జైల్‌కు వెళ్తున్న టి.దుర్గారావు, పార్వతీపురం మన్యం జిల్లా సబ్ జైలర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై చిత్తూరు వెళ్తున్న అప్పలనారాయణలకు స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో అధికారులు గురువారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. పూలు, పండ్లు, దుశ్శాలువలు, జ్ఞాపికలతో ఇద్దరినీ ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా పనిచేయగలిగే సామర్థ్యం ఉన్న వ్యక్తులుగా మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని , అందరి అభిమానం చూరగొన్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

రూ. కోటి నిధులతో...
రాములోరి ఆలయ అభివృద్ధి

- రామతీర్థంలో అభివృద్ధి పనులు ప్రారంభం
- శాశ్వత యాగశాల నిర్మాణానికి శ్రీకారం
- ఆలయంలో శర వేగంగా ఫ్లోరింగ్ తవ్వకాలు
- ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు



రామతీర్థం దేవాలయం

నెల్లిమర్ల రూరల్:

భక్తులకు శుభవార్త. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానం అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎంతో ఘనకీర్తి కలిగిన దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే రామతీర్థం బోడికొండపై ఏళ్ల కాలం నుంచి శిథిలావస్థలో ఉన్న కోదండ రామాలయాన్ని రూ.3 కోట్ల నిధులతో సర్వాంగ సుందరంగా నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. తాజాగా దిగువనున్న ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడంతో దేవాలయ అభివృద్ధి కుంటుపడింది. సాక్షాత్తు కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక గజపతిరాజు ఆలయానికి ధర్మకర్తగా వ్యవహరిస్తున్నప్పటికీ రామక్షేత్ర అభివృద్ధిని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భక్తుల మనోభావాలకు అనుగుణంగా, ఆగమ, వాస్తు శాస్త్రప్రకారం ఆలయాన్ని అభివృద్ధి చేస్తుండడంపై భక్తలోకం హర్షం వ్యక్తంచేస్తోంది.



ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు (ఫైల్)

రూ.కోటితో పనులు ప్రారంభం

రామతీర్థం దేవాలయంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.కోటి సీజీఎఫ్ నిధుల మంజూరు చేసింది. అభివృద్ధి పనులకు టెండర్లు కూడా పూర్తి కావడంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆలయంలో శిథిలావస్థకు చేరిన పాతఫ్లోరింగ్‌ను కార్మికులు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మరికొద్ది రోజుల్లోనే ఫ్లోరింగ్ నిర్మాణంతో పాటు శాశ్వత యాగశాల నిర్మాణం, ఉత్తరరాజగోపురం వద్ద బ్యూటీఫికేషన్ పనులు పూర్తి చేయనున్నారు.

యాగశాల నిర్మాణంతో తొలగనున్న ఇబ్బందులు



శాశ్వత యాగశాల నిర్మాణం చేయనున్న ప్రదేశం

రామతీర్థంలో యాగశాలలో ఏడాది పొడవునా నిత్యం హోమాలు జరుగుతుంటాయి. అంతే కాకుండా ప్రత్యేక రోజుల్లో మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు జరిపిస్తుంటారు. ఎప్పటి నుంచో రామతీర్థంలో తాటికమ్మలతో కూడిన యాగశాలలోనే కార్యక్రమాలు కొనసాగుతూ వస్తున్నాయి. ముఖ్యంగా శివరాత్రి సమయాల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మత్స్యకారులు వారి సంప్రదాయబద్ధ పూజల్లో భాగంగా కాగడాలు వెలిగిస్తూ ఆలయం వెలుపలికి రావడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆలయ అధికారులు ప్రతి ఏటా తాటి కమ్మలను తీయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మళ్లీ ఉత్సవాలు ముగిసిన వెంటనే కొత్త తాటాకుల కమ్మలతో యాగశాలను నిర్మిస్తున్నారు. అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు శాశ్వత యాగశాల నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో ఇబ్బందులు తొలుగుతాయని భక్తులు, అర్చకులు చెబుతున్నారు.

పనులు ప్రారంభమయ్యాయి



రామతీర్థం దేవాలయంలో రూ.కోటి సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పాత ఫ్లోరింగ్ తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు చెప్పాం. ముందుగా ఆలయం మొత్తం ఫ్లోరింగ్ పూర్తయ్యాక శాశ్వత యాగశాల, ఉత్తర రాజగోపురం వద్ద ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– కిశోర్‌కుమార్, ఈఓ, రామతీర్థం దేవస్థానం

నిధుల కేటాయింపు ఇలా...

మొత్తం మంజూరైన నిధులు	:	రూ.1,00,00,000
గ్రానైట్ స్టోన్‌తో ఫ్లోరింగ్ నిర్మాణానికి	:	రూ.58,23,038
శాశ్వత యాగశాల నిర్మాణానికి	:	రూ.11,25,663
రిటైనింగ్ వాల్ నిర్మాణం, అభివృద్ధికి	:	రూ.14,47,609
మండపం కూల్చివేత ఖర్చు	:	1,00,000
ఇతర ఖర్చులు	:	15,03,690



పాత ఫ్లోరింగ్ తొలగింపు దృశ్యం

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ సహాయ కలెక్టర్



కలెక్టర్ నాగలక్ష్మితో మాట్లాడుతున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం ఫోర్ట్: శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. పరిపాలనా పరమైన అంశాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును అధ్యయనం చేశారు. 2022 సివిల్ సర్వీసెస్‌కు బ్యాచ్‌కు చెందిన వెంకటత్రివినాగ్ హైదరాబాద్ ఐఐటీ మెటలర్జీ బ్రాంచిలో 2020లో బీటెక్ పూర్తి చేశారు. విజయవాడ, విశాఖపట్న ం, ముంబై తదితర నగరాల్లో పాఠశాల విద్య ను పూర్తిచేసి సీబీఎస్ఈ అఖిల భారత పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచారు. త్రివినాగ్ తండ్రి బి.అజయ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. అజయకుమార్ స్వస్థలం విశాఖపట్నం. శ్రీకాకుళంలో నిర్వహించిన చదరంగం టోర్నమెంట్‌లో గతంలో పాల్గొన్నట్టు ట్రైనీ కలెక్టర్ వివరించారు.

తెలంగాణ ఎంసెట్‌లో 20వ ర్యాంకు



సంతోషిణి

బొబ్బిలి: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ఎంసెట్) తెలంగాణ రాష్ట్ర ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థిని వి.సంతోషిణి ఉత్తమ ర్యాంకు సాధించి సత్తా చాటింది. బొబ్బిలి డివిజన్‌లోని బాడంగి మండలం మల్లంపేటకు చెందిన సంతోషిణి 20వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి అప్పారావు భోగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్నారు. తల్లి భవాని గృహిణి.

చెట్టు కొమ్మలు పడి మహిళకు గాయాలు



రైల్వేస్టేషన్‌లో గాయపడిన మహిళను కారు ఎక్కించిన స్థానికులు

దత్తిరాజేరు: భారీ ఈదురుగాలుల కారణంగా మండలంలోని కోమటిపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం రైలు దిగి నడుచుకుంటూ వస్తున్న మహిళపై చెట్టుకొమ్మలు విరిగిపడడంతో తలకు తీవ్రమైన గాయమైంది. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు తన కారులో బాధితురాలిని దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చా రు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రాథమిక వైద్యం చేసి 108లో గజపతినగరం పంపించారు. టి.బూర్జవలసలో వారి బంధువు అనారోగ్యంతో మృతిచెందడంతో పరామర్శించడానికి పార్వతీపురం నుంచి ఇనుముల పార్వతి వస్తుండగా రైల్వేస్టేషన్‌లో గాయపడింది. గాయపడిన మహిళను ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు పరామర్శించారు.

పిడుగుపడి మహిళ మృతి



మృతిచెందిన పార్వతి

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురం గ్రామానికి చెందిన గంట పార్వతి(48) పిడుగు పడి గురువారం సాయంత్రం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పొలం పనులకు వెళ్లిన ఆమె తిరిగి వస్తుండగా పిడుగుపడంతో స్పృహతప్పి పడిపోయింది. ఈమేరకు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త సింహాచలం, కొడుకు, కుమార్తె ఉన్నారు.

మరో సంఘటనలో గేదె..



పొలంలో మృతిచెందిన పాడిగేదె

మెంటాడ: మండలంలోని జయితి గ్రామంలో ఈదురుగాలులు వీయడంతో పిడుగుపడి గ్రామానికి చెందిన పొట్టంగి అప్పలనాయుడి పాడి గేదె మృతి చెందింది. పొలాల్లో మేతకోసం గేదెను విడిచిపెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అప్పలనాయుడు కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. అలాగే గ్రామంలోని ప్రధానవీధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా నేలకొరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. గాలుల తాకిడికి అక్కడక్కడ చెట్లు కూలిపోయాయన్నారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఆహ్వానం



హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానిస్తున్న గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్టును సందర్శించాల ని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎ.వి.శేషసాయిని ట్రస్టుచైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు గురువారం ఆహ్వానించారు. తన బృంద సభ్యులతో అమరావతిలోని హైకోర్టు ప్రాంగణంలో చీఫ్ జస్టిస్ ను కలిశారు. ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగుల కు చేస్తున్న సేవ, కృత్రిమ అవయవాల తయారీ, ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలను వివరించా రు. ఆగస్టు నెలలో ట్రస్టును సందర్శిస్తానని శేషసాయి తెలిపినట్టు జగదీష్‌బాబు స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు.

వచ్చేనెల 2న జీసీసీ టెండర్లు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమపాఠశాలలు, గురుకులాలకు కిరాణా సరుకులు సరఫరా చేసేందుకు ఈ నెల 2వ తేదీన టెండర్లు నిర్వహిస్తామని జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 1వ తేదీ వరకు టెండర్లు స్వీకరిస్తామన్నారు

ట్రైనీ కెమిస్టులకు ఆహ్వానం

పార్వతీపురం: ఇంటర్మీడియట్ (ఎంపీసీ/బైపీసీ గ్రూపులు) 2022-23లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ట్రైనీ కెమిస్టులుగా అవకాశం కల్పించేందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ ఆహ్వానిస్తోంది. మొత్తం 40 ఖాళీలకు గాను ఈ నెల 31వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనీ కెమిస్టులుగా ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి 1.6 లక్షల వేతనం అందజేయడంతో పాటు ఉన్నత చదువును (డిగ్రీ) రెడ్డీస్ ల్యాబ్ చదివిస్తుందని పేర్కొన్నారు. అలాగే సబ్సిడీపై వసతి, భోజన సదుపాయం కల్పించనుందని తెలిపారు. 18 నుంచి 23 సంవత్సరాల(15జూన్ 2003 నుంచి 15 జూన్ 2005 మధ్య జన్మించిన వారు) వయస్సు గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూకు అర్హులని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరు కాదలచిన అభ్యర్థులు దరఖాస్తు(రెజ్యూమ్)తో పాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9182398235 (పి.జగ్గునాయుడు, 7997299730 (మనోజ్ కుమార్)లను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు వారి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు 1 పాస్‌పోర్ట్ ఫొటోతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

పరిమళించిన మానవత్వం



గోపాల్ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహిస్తున్న న్యూ విజయనగరం యూత్ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: మానవత్వం పరిమళించింది. ఓ వ్యక్తి మృతదేహానికి న్యూ విజయనగ రం యూత్ సభ్యులు గురువారం అంత్యక్రియ లు పూర్తిచేశారు. వివరాల్లోకి వెళ్తే... కడప జిల్లా మంగపట్నం కమ్మవారిపల్లెకు చెందిన గోపాల్‌నాయుడు అనే వ్యక్తి ఇటుక బట్టీల్లో మట్టిపను లు చేసేందుకు భార్య వెంకటలక్ష్మితో కలిసి ఏడాది కిందట పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వచ్చాడు. రెండు రోజుల కిందట అనారోగ్యానికి గురికావడంతో వైద్యసేవల కోసం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధ వారం మృతి చెందాడు. అంత్యక్రియలు చేయ డానికి డబ్బులు లేక గోపాల్‌నాయుడు భార్య బాధపడుతున్న విషయం తెలుసుకున్న న్యూ విజయనగరం యూత్ సభ్యులు శివ, అనిల్‌కుమార్‌లు రింగ్ రోడ్డులో ఉన్న వైకుంఠ ద్వారంలో మృతుడికి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆ సమయంలో మృతుడి భార్య కన్నీటిపర్యంతమైంది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. అయితే, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారని, అందులో ఒకరు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్టు సమాచారం. తండ్రి మృతి చెందాడన్న విషయాన్ని అంబులెన్స్ డ్రైవర్ తెలియజేసినా పట్టించుకోలేదని, అక్కడే దహన సంస్కారాలు పూర్తిచేయాలని, డెత్ సర్టిఫికెట్ పంపిస్తే చాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు తెలిసింది.

మామిడితో ఆదాయం మెండు..!

- కొత్తగా తోటలు వేయడానికి అదును ఇదే
- మెలకువలు పాటిస్తే సిరుల పంట
- వరుసగా మూడేళ్లు ప్రభుత్వ సాయం



నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మామిడి మొక్కలు

పాలకొండ రూరల్: ప్రస్తుతం మామిడి తోటలు వేసేందుకు అనుకూల పరిస్థితులు ఉంటాయని ఉద్యానవన శాఖాధికారులు పేర్కొన్నారు. జిల్లాలో అధిక శాతం రైతులు ప్రత్యామ్నాయ, వాణిజ్యపంటలపై మక్కువ చూపుతుండడం మంచి పరిణామం. దాదాపు 5వేల పైచిలుకు హెక్టార్లలో మామడి సేద్యం జిల్లా పరిధిలో జరుగుతోంది. ఈ క్రమంలో నూతనంగా తోటలు వేయదలచిన రైతులు రానున్న జూన్ నెలలో వచ్చే తొలకరి వర్షాలకు ముందుగానే సిద్ధం కావాలని సూచిస్తున్నారు. మామిడి తోటల సాగుపై ఉద్యానవనశాఖాధికారులు తెలియజేస్తున్న జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

భూసార పరీక్షలు..

మామిడితోటలను నాటే రైతులు సంబంధిత భూమిలో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. నేల లక్షణాలకు అనుగుణంగా రెండు లేదా మూడు ప్రాంతాల్లో ఆరడుగుల లోతువరకు గోతులు తవ్వి ఒక్కో అడుగుకు గుప్పెడు మట్టి నమూనా తీసి విడివిడిగా పొట్లాలు కట్టి పరీక్షలకు పంపాలి. తోటలు పెంచదలిచిన నేలను వేసవిలో లోతుగా దుక్కిచేసి ఎండనివ్వాలి. పొడవు, వెడల్పు, లోతు మీటరు వైశాల్యం ఉండేలా గుంతలను వేసవిలోనే తవ్వించి బాగా ఆరనివ్వాలి. సారవంతమైన భూముల్లో మొక్కలు బాగా పెరుగుతాయి కనుక గుంతల మధ్య దూరం తేలిక భూములకన్నా ఎక్కువగా ఉండేలా చూడాలి. సాధారణ తోటల్లో మొక్కకు మొక్కకు మధ్య 8 మీటర్ల దూరం ఉంచితే అంతర పంటల సేద్యానికి అనుకూలంగా ఉంటుంది. మామిడి మొక్కల్లో పెరుగుదల తక్కువ. హైబ్రీడ్ రకాలు వేసేటప్పుడు అధిక సాంద్రతలో 5.5 మీటర్లు ఎడం ఉండేలా ఎకరాకు 160 మొక్కలు నాటుకోవడం మంచిది.

వాతావరణం..

పూత సమయంలో శీతోష్ణం, గాలిలో తగినంత తేమ ఉండే వాతావరణం శ్రేయస్కరం. వర్షపాతం ఏటా ఆరు వందల మిల్లీమీటర్లు తగ్గకుండా ఉండే విధమైన భూములను ఎంచుకోవాలి. నీరు నిలవని గరప నేలలు, చౌడు లేని భూములు ఈ తోటలకు అనుకూలంగా ఉంటాయి. బంక నేలలు, సుద్ద పొరలు, నూనె మెరుగులు, సున్నపు రాళ్లు అధికంగా ఉన్న నేలలు మామిడితోటల పెంపకానికి ప్రతికూలంగా ఉంటాయి. ఉదజని సూచిక 6 నుంచి 7.5 వరకు ఉన్న నేలలు అనువైనవి.

అంటుమొక్కల సేకరణ..

పండ్లతోటలు నాటే వారికి నాణ్యమైన మొక్కల లభ్యత ప్రధాన సమస్యగా మారే పరిస్థితి ఉంది. ఎంపిక చేసుకున్న మొక్కలను బట్టే తోటల పెరుగుదల ఉంటుంది. మొక్కలు అమ్మే నర్సరీల వద్ద తమ భూమి స్థితిగతులను వివరించి అందుకు తగ్గట్లుగా పెరుగుదల ఉండే మొక్కలపై రైతులు దృష్టి సారించాలి. ఎంచుకున్న మొక్కల్లో భౌతిక లక్షణాలు, జన్యుపరమైన సమస్యలను ముందుగానే పరీక్షించుకోవడం మేలు. నర్సరీల్లో తల్లిచెట్టు ఉండదు. అంటుకట్టిన మొక్కలను అమ్మకానికి ఉంచుతారు. దీనిపై కూడా అవగాహన పెంచుకోవాలి.

సొంతంగా అంటుకడితే మేలు..

తొలకరిలో పండ్లతోటలను నాటదలచిన రైతులు దగ్గర్లో ఉన్న నర్సరీకి వెళ్లి తాము ఎంచుకున్న మొక్కలకు సొంతంగా అంటుకట్టించడం శ్రేయస్కరం. వేరు మూలం, మొక్కలను పరిశీలించి, తల్లిచెట్టును గమనించిన రైతులు ఆ తరువాత దానినుంచి రెమ్మలను సేకరించి నర్సరీల్లో అంటుకట్టే ఏర్పాటు చేయించాలి. ఆ మొక్కలపై గుర్తులను ఏర్పాటు చేసుకుని అవే మొక్కలను తోటల్లో వేయడం మంచిది.

టెంక ద్వారా కూడా..

రైతులు టెంకలను సేకరించుకుని స్వయంగా నారు పోసుకుని మొక్కలను పెంచుకోవడం మరోపద్ధతి. సమీపంలో విరగ్గాస్తున్న మొక్కలను గుర్తించి వాటి టెంకలను సేకరించడం లేదా చెట్ల నుంచి కాడలను, మొగ్గ అంట్లను తెచ్చుకోవాలి. రైతులే స్వయంగా అంటుకట్టి ఆ మొక్కలను వేయడం లాభదాయకం. మామిడి తోటలపై మక్కువ ఉన్న రైతులు ప్రణాళికాబద్ధంగా భూములను తయారు చేసుకోవడంతో పాటు ముందస్తుగా మొక్కలను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే వనసంరక్షణ, ఉద్యానవన శాఖల ద్వారా మరిన్ని మెలకువలు తెలుసుకుని తోటలు వేసుకుంటే సకాలంలో పంట చేతికి వచ్చి లాభాల బాట పట్టవచ్చు.

ప్రభుత్వ సహకారం



ఉద్యానవన శాఖ పరిధిలో మామిడి, జీడి రైతులకు ప్రభుత్వ సహకారం ఉంటుంది. ఆసక్తిగల రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తాం. ఈ తోటల పెంపకానికి తొలిదశలో రూ.35వేలకు పైబడి మదుపు అవుతుంది. మొదటి సంవత్సరం రూ.7,980, రెండు, మూడవ సంవత్సరాలు రూ.2,660 చొప్పున మామిడి రైతుకు రాయితీ వస్తుంది. జీడి తోటలు వేయదచిన రైతులకు హెక్టారుకు దాదాపు 200 మొక్కలు అవసరం ఉటుంది. రూ.50వేల వరకు ఖర్చు అవుతుంది. రాయితీ మొదటి సంవత్సరం రూ.12వేలు, రెండు, మూడు సంవత్సరాలకు రూ.4వేలు వంతున రాయితీ రూపంలో ప్రభుత్వం ద్వారా పొందవచ్చు. ప్రస్తుతం సీతంపేట, బొబ్బిలి నర్సరీల్లో మొక్కలు సిద్ధంచేయిస్తున్నాం.

తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారిణి, పాలకొండ